ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025




ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

## ప్రకృతి, సంస్కృతి ప్రభుత్వ ప్రాధాన్యాలు

- ఈ దిశగానే పర్యాటక అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

సూళ్లూరుపేట/తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని సంస్కృతిని గుర్తుపెట్టుకోవడమే కాకుండా వాటి ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ఉద్దేశమని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించామని తెలిపారు. ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ వలసపక్షుల విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయన్నారు. సీఎం సూచనల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించామన్నారు.

**● ఐదుగురు ఎమ్మెల్యేల హాజరు**

ముగింపు సమావేశంలో గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చీరాల ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, కురుగుండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎంఎం కొండయ్యలు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్టు సెల్వం, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తానంకి నానాజీ, మాజీ మంత్రి పరసారత్నం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, టూరీజం ఆర్డీ రమణప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి, జిల్లా



కృతిశెట్టి స్టెప్పులు



సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన పక్షుల పండుగ ముగింపు సభలో జనం

# జాతరలా ఫెస్టివల్!

- ఘనంగా ముగిసిన పక్షుల పండుగ
- భారీగా తరలివచ్చిన జనం

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత మూడురోజులపాటు జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా ముగిసింది. తొలిరోజు ఏర్పాట్లలో తడబడినా మిగిలిన రెండు రోజులూ అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో సక్సెస్ చేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో సాయంత్రాలు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారెత్తించాయి. సినీ నటులూ, గాయకులూ రావడంతో జనం పోటెత్తారు. మూడోరోజు సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేలాదిగా పక్షుల పండుగకు తరలివచ్చారు. రంగురంగుల యూనిఫారాల్లో పిల్లలు సందడి చేశారు. నేలపట్టులో పక్షుల వీక్షణకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అటకానితిప్ప వద్ద కూడా ఆటలతో సందడిగా గడిపారు. బీవీపాలెం పడవల రేవు మూడో రోజు కూడా కిక్కిరిసిపోయింది. సూళ్లూరుపేట ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద జనం బారులు తీరారు. ఈ ప్రాంతంలో జరిగే చెంగాళమ్మ జాతరను ఫ్లెమింగో ఫెస్టివల్ తలపించింది. మరోవైపు ఆటల్లోనూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**● ఉత్సాహంగా క్రీడలు**

నిజానికి తొలిరోజు కురిసిన వర్షంతో ఆదివారం సాయంత్రం వరకు క్రీడలు జరగలేదు. నిర్వాహకులు ఆగమేఘాలమీద మట్టి, ఇసుక తోలి చదును చేసి క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే కబడీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడారు. రాత్రి 7 గంటల వరకూ క్రీడా పోటీలు జరిగాయి.

ముగింపు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు పోటెత్తి వచ్చారు. సూళ్లూరుపేట కాలేజీ మైదానం నిండిపోయి, ప్రజలు బయటకూడా బారులు తీరారు. సినీరంగానికి చెందిన కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆపి సభను ప్రారంభించారు. ఇటువంటి సందర్భంలో ఎక్కువ సేపు ఉపన్యాసాలు మంచిది కాదనే ఉద్దేశంతో మంత్రి తర్వాత ప్రసంగించిన వారంతా సంక్షిప్త సందేశాలతో ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పండుగ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇక జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఎమ్మెల్యే విజయశ్రీని అనుసరించి ముగించేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం 'ఇప్పుడు మమ్మల్ని పట్టించుకునే పరిస్థితి జనాలకు లేదు' అంటూ ధన్యవాదాలతో ముగించారు. హీరోయిన్లు సంయుక్త మీనన్, కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగ్లీ పాట హుషారెత్తించింది.



వేదికపై సంయుక్త మీనన్




పాటలు పాడుతున్న మంగ్లీ

---

## వేణుగోపాలుడికి పూర్వ వైభవం

- ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం
- రూ.16.70 కోట్లతో టెండర్లు పిలిచిన దేవదాయ శాఖ
- రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా లక్ష్యం

- వివరాలు 7లో..



## రూ.86.21 కోట్ల మద్యం హాంఫట్!

పండుగ రోజుల్లో తెగతాగేశారు! ● అమ్మకాలు పెరిగినా రాబడి తక్కువే



నెల్లూరు(క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆరంభం నుంచే జిల్లాలో మందుబాబులు తెగ తాగేశారు. జనవరి 1వ తేదీ వేడుకల నుంచి సంక్రాంతి పండుగ ముగింపు వరకు రూ.86.21 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. అయితే, గత ఏడాదితో పోల్చుకుంటే అమ్మకాలు పెరిగినా రాబడి మాత్రం తక్కువగా వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వంలో మద్యం ధరలు తగ్గించడమే. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వైన్‌షాపులను ఏర్పాటు చేయడంతోపాటు మందుబాబులు అధికంగా సేవించే మద్యం ధరలను తగ్గించారు. ప్రధానంగా మ్యాన్స్‌హౌస్ వంటి బ్రాండ్ల ధరలను తగ్గించడంతోపాటు నాణ్యత కలిగిన పాత బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడం, రూ.99లకే క్వార్టర్ మద్యం అందుబాటులోకి తీసుకురావడంతో మందుబాబులు ఈ ఏడాది అధికంగా మద్యం సేవించినా రాబడి మాత్రం గత ఏడాదితో పోల్చుకుంటే తక్కువుగానే ఉంది. 2024లో రూ.94.36 కోట్ల 1,07,811 ఐఎంఎల్ కేసులు, 25,930 బీర్ కేసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి 19వ తేదీ వరకు 1,16,952 ఐఎంఎల్ కేసులు, 34,034 బీర్ కేసులను విక్రయించారు. అయితే, రాబడి మాత్రం రూ.86.21 కోట్లు వచ్చింది.

# అర్జీల్లో ఆక్రందన!

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- 731 గ్రామాల్లో 8,132 అర్జీల స్వీకరణ
- పరిష్కారమైనవి 2,617
- భూసమస్యలపైనే భారీగా ఫిర్యాదులు

నెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో రెవెన్యూ సదస్సులను పరిశీలిస్తే అర్థమవుతుంది. రికార్డుస్థాయిలో 8,132 సమస్యలు ఈ సదస్సుల్లోనే వెలుగు చూశాయంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. ఈ సదస్సుల వేదికగా గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ పనితీరు వేలెత్తి చూపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా వైసీపీ హయాంలో భూసమస్యలు విపరీతమయ్యాయి. నాడు అధికార బలంతో సామాన్యుల భూములను వివాదంలోకి తీసుకెళ్లారు. విచ్చలవిడిగా భూరికార్డులు మార్చేయడం, ఖాళీగా ఉంటే ఆక్రమించేయడం వంటి అనేక సంఘటనలు నాడు వెలుగులోకి వచ్చాయి.

**● క్యూ కట్టిన బాధితులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల వద్దకు బాధితులు బారులు తీరారు. ఈ పరిస్థితి చూసి చలించిపోయిన ప్రభుత్వ పెద్దలు భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డిసెంబరు

- మిగతా 6లో..



ఉదయగిరి మండలం బిజ్జంపల్లి సచివాలయంలో గత నెల 31న జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీ ఇచ్చేందుకు ఎగబడుతున్న ప్రజలు (ఫైల్)

## బీజేపీ జిల్లా సారథి ఎవరో!?

నామినేషన్లు దాఖలు చేసిన నలుగురు ● నేడు ప్రకటించనున్న అగ్రనేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా సారథి ఎవరన్నది మంగళవారం తెలిపోనుంది. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. ఈ క్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుత పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డితోపాటు భరత్‌కుమార్ యాదవ్, బైరి శ్రీనివాసులు, మొగరాల సురేష్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్‌లు దాఖలు చేసే సమయంలో బీజేపీ జిల్లా కార్యాలయం కార్యకర్తలతో కోలాహలంగా మారింది.

## 'జేఈఈ మెయిన్స్'కు సర్వం సిద్ధం

**● రేపటి నుంచి రెండు షిఫ్టులలో పరీక్ష**

నెల్లూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరులోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్, తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్‌కు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షకు అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ ఇప్పటికే విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో పరీక్షలు జరుగుతాయన్నారు.

**● కఠిన నిబంధనలు**

పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన అడ్మిట్ కార్డు, ఆన్సర్‌షీట్‌పై అతికించేందుకు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, దరఖాస్తు చేసిన సమయంలో అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డు ఒరిజినల్, బాల్ పాయింట్ పెన్, నీళ్లు బయటకు కనిపించే వాటర్ బాటిల్ తీసుకెళ్లాలని సూచించారు. అలాగే గేట్ మూసివేసే సమయం తరువాత పరీక్ష ప్రారంభం అయ్యే సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులను అనుమతించరన్నారు. అదేవిధంగా పరీక్ష రాసే విద్యార్థులు తమ ధ్రువీకరణను తెలిపే ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు తీసుకెళ్లాలన్నారు. 2 గంటల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

# కడుపు... కోతే!!

- కాన్పుల్లో సిజేరియన్లకే ప్రాధాన్యం
- సుఖ ప్రసవానికి అవకాశం ఉన్నా సర్జరీకే మొగ్గు
- కాసుల కోసం ప్రైవేటు వైద్యుల నిర్వాకం
- రూ.వేల నుంచి లక్షల్లో వసూలు
- జిల్లాలో ఏటా 35 శాతం 'కోత' ప్రసవాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పెరుగుతున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు



విడవలూరు మండలానికి చెందిన ఓ గర్భిణికి 20 రోజుల్లో నెలల నిండుతున్నాయనగా కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ గర్భిణికి స్కానింగ్ తీయించగా ఉమ్మనీరు తక్కువగా ఉందని, వెంటనే సిజేరియన్ చేయాలని లేదంటే బిడ్డకు ప్రమాదని డాక్టర్ హెచ్చరించారు. అనంతరం ఆ గర్భిణికి సిజేరియన్ సర్జరీ చేశారు. ఇందుకు రూ.60 వేలు వసూలు చేశారు. తీరా స్కానింగ్ రిపోర్టును తెలిసిన మరో డాక్టర్‌కు చూపించగా ఉమ్మనీరు బాగుందని ఎలాంటి ఇబ్బందులు లేదని తెలుపడంతో మోసపోయామని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేసిన వైద్యురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

...ఇలా అవసరం లేకపోయినా ఒకటి కాదు రెండు కాదు జిల్లాలో వేలసంఖ్యలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ప్రతి మహిళ జీవితంలో అపురూపమైన ఘట్టం తల్లికావడం. మరొకరికి జన్మనివ్వడమైనది అనిర్వచనీయ మైన అనుభూతి. ఇందుకోసం ప్రతి స్త్రీ ఎదురుచూస్తుంది. గర్భం దాల్చిన తర్వాత నవమాసాలు మోసి బిడ్డను ప్రసవిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో మినహా సాధారణంగా గర్భిణులందరికీ సుఖ ప్రసవమే(సాధారణ కాన్పు) చేయాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే ప్రస్తుత కాలంలో ఎంతో మంది వైద్యులు సంపాదనే ధ్యేయంగా, కాసుల కక్కుర్తితో అవసరం ఉన్నా, లేకపోయినా 'కడుపు కోత' కోస్తున్నారు.

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ప్రసవాలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా 42శాతం సిజేరియన్ సెక్షన్ డెలివరీలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి. వైద్యులను దేవుళ్లగా చూసే సమాజంలో ప్రసవం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే సుఖ ప్రసవం చేయాల్సిన ఆ వైద్య నారాయణులు ఏమాత్రం కనికరం లేకుండా సిజేరియన్ తప్పదంటూ 'కోత' కోస్తున్నారు. ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో 10 నుంచి 15 శాతం మాత్రమే సిజేరియన్లు అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. కానీ జిల్లాలో 35 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. వైద్యులు డబ్బుకే ప్రాధాన్యమిస్తూ, గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను భయాందోళనకు గురిచేసి శస్త్రచికిత్సల ద్వారా కాన్పులు చేస్తున్నారు. ఇందుకోసం రూ.వేలు, లక్షలు వసూలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్ల సంఖ్య పెరగడం విచారించాల్సిన విషయం.

**● ఏటా 12 వేలకుపైగా...**

జిల్లా వ్యాప్తంగా ఏటా 40 వేలకుపైగా ప్రసవాలు జరుగుతున్నాయి. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10వేల వరకు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 30 వేలకుపైగా కాన్పులు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేక ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి మరుసటి ఏడాది మార్చి వరకు జరిగే ప్రసవాలను వైద్య ఆరోగ్యశాఖ లెక్క కడుతోంది. ఈ లెక్కన ప్రసవాలలో సిజేరియన్‌లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. మొత్తం కాన్పుల్లో 35 శాతం సిజేరియన్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రతి సంవత్సరం 12 వేలకుపైగానే సిజేరియన్లు జరుగుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఆపరేషన్ సులభతరం కావడానికితోడు పెద్ద మొత్తంలో డబ్బు వస్తుండటంతో ఎక్కువ మంది వైద్యులు సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గర్భిణుల ఆరోగ్యంపై సిజేరియన్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. కాగా, నెల్లూరులోని జీజీహెచ్ ప్రసూతి విభాగంలో ప్రతినెల 350కిపైగా ప్రసవాలు జరుగుతుం డగా ఇక్కడ కూడా ఎక్కువ సిజేరియన్లు చేస్తున్నట్లు సమాచారం.

**● ఆసుపత్రులపై పర్యవేక్షణ ఏది..?**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేపట్టే ప్రసవాలపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. ఆయా ఆసుపత్రుల పనితీరును పరిశీలించి, కాన్పుల గణాంక రికార్డులు తనిఖీ చేసి, అవసరమైన వారికే సిజేరియన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అప్పుడప్పుడూ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సిజేరియన్లు చేయవద్దని హెచ్చరిస్తున్నారేగానీ, సిజేరియన్లు చేస్తున్న ఆసుప త్రులపై చర్యలు తీసుకోకపోవటంతో వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం కాన్పులు ఇలా...

| సంవత్సరం | ప్రసవాలు | సాధారణ కాన్పులు | సిజేరియన్‌లు |
|---|---|---|---|
| 2021- 22 | 41,387 | 26,804 | 14,583 |
| 2022- 23 | 43,523 | 27,128 | 16,395 |
| 2023- 24 | 44,886 | 33,638 | 11,228 |
| 2024- 25 | 20,462 | 11,411 | 9,051 |

(నవంబరు వరకు)

ఆత్మకూరుకు చెందిన ఓ గర్భిణి మూడో నెల నుంచి సామాజిక ఆసుపత్రిలో చూపించుకుంటోంది. అక్కడ స్కానింగ్ కూడా తీసి ఆరోగ్యం బాగుందని సాధారణ కాన్పు జరుగుతుందని వైద్యులు తెలిపారు. అయితే పురుడు కోసం ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్య పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉందని సిజేరియన్ చేయాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బాగుందని చెప్పారని మొత్తుకున్నా సిజేరియన్‌కే వైద్యులు మొగ్గుచూపటంతో చేసేది లేక ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది.

**చర్యలు తీసుకుంటాం**

ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్న మాట వాస్తవమే.. ప్రభుత్వ కూడా సిజేరియన్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఏఏ ఆసుపత్రులు ఇలాంటి ఆపరేషన్లు ఎక్కువగా చేస్తున్నాయి, ఆపరేషన్ల అవసరమెంత అన్న కోణంలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అత్యవసరమైతే తప్ప సిజేరియన్ చేయరాదన్న నిబంధన ఉన్నా దీన్ని ఉల్లంఘించి శస్త్రచికిత్సలు చేస్తున్నార్న విమర్శలున్నాయి.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో





## పిల్లల కేరింతలు.. పిట్టల కిలకిలలు..
















# కళకళలాడిన నేలపట్టు

### ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్

### మూడు రోజులూ పోటెత్తిన జనం










చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.

## ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..





## ఆటల వేదికలా అటకానితిప్ప



పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

### పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనం దంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం

## సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

### సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.

---

(5వ పేజీ తరువాయి)

6 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 731 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఆనంద్ నియమించారు. ప్రతి మండలంలో రోజుకొక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులకు ప్రత్యేకాధికారులతోపాటు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వోలు పూర్తి రికార్డులతో హాజరయ్యారు. భూవివాదాలకు సంబంధించిన ప్రతి అర్జీని స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించారు. కాగా రెవెన్యూ సదస్సులు తొలివారంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. వీటిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ అర్జీలు అందలేదు. అయితే ఆ తర్వాత జిల్లా ఉన్నతాధికారులు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడంతో స్పందన పెరిగింది. తొలి నాలుగు రోజుల్లో కేవలం 459 అర్జీలు మాత్రమే వచ్చాయి. అంటే సరాసరి రోజుకు 115 అర్జీలు

## అర్జీల్లో ఆక్రందన

మాత్రమే రాగా, ఆ తర్వాత రోజుకు సరాసరి 300 వరకూ అర్జీలు అందడం గమనార్హం.

**● ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి**

ఈ నెల 8వ తేదీనాటికి సదస్సులు ముగియగా, వచ్చిన అర్జీలన్నిటినీ ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో మొత్తం అందిన అర్జీలు 8,132గా తేలాయి. ఇందులో ఎక్కువగా ఆర్‌వోఆర్ (భూహక్కులు)కు సంబంధించినవే ఉన్నాయి. ఇవే సగానికిపైగా ఉండటం విశేషం. తమ భూమిని మరొకరు వారి పేర్లపైకి ఎక్కించుకున్నారని.. తమ పేర్లు ఉండాల్సిన చోట ప్రభుత్వం అని పెట్టి ఉన్నారని.. నోషనల్ ఖాతా అని చెప్పి నిషేధిత జాబితాలో చేర్చారని.. ఇలా పలురకాల భూరికార్డులకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. ఆ తర్వాత స్థానంలో అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన సమస్యలు, భూ హద్దులకు సంబంధించిన సమస్యలు నమోదయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 2,617 అర్జీలను రెవెన్యూ అధికారులు పరిష్కరించగా, మరో 5,515 అర్జీలు పరిష్కార దశలో ఉన్నాయి. వీటిలో కొన్ని తహసీల్దార్ స్థాయిలో విచారణ జరుగుతుండగా, మరికొన్ని అక్కడ విచారణ పూర్తయి ఆర్‌డీవో స్థాయికి చేరాయి. ఈ అర్జీల పరిష్కారస్థితిని జేసీ కే కార్తీక్ నిరంతరం సమీక్షిస్తున్నారు. రెగ్యులర్‌గా టెలికాన్ఫరెన్స్‌లో ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడుతూ సూచనలిస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాలు మినహా మిగిలిన వాటిని నెలలోపుగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● సాయల్ కన్జర్వేషన్ ఏడీఏ శ్రీనివాసరావు

● ఉదయగిరిలో దుకాణాల తనిఖీ

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు సాయల్ కన్జర్వేషన్ ఏడీఏ శ్రీనివాసరావు ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని క్రయ, విక్రయ రిజిస్టర్లను పరిశీలించి గోదాముల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడు తూ వ్యాపారులు ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన వాటికి బిల్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రయంలో వీరారెడ్డి, మల్లికార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

---

## మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా

● నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ



బాధ్యతలు చేపడుతున్న సింధుప్రియ

నెల్లూరు (క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందిస్తామని నెల్లూరు నగర డీఎస్పీ పెసర సింధుప్రియ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఆమె నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. నగరంలోని సీఐలు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా సింధుప్రియ మాట్లాడుతూ తనకు ఇదే తొలిపోస్టింగ్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము తీసుకోను న్న చర్యలకు సహకరించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్యను డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఉపాధిలో దొంగలు

● వార్షిక ఆడిట్‌తో వెలుగులోకి అక్రమాలు

● బాధ్యులపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు (జడ్పీ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు పని కల్పించి, పట్టెడన్నం పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దొంగలు పడ్డారు. పేదలకు ఇవ్వాల్సిన సొమ్మును గద్దల్లా తన్నుకుపోతున్నారు. కంచే చేను మేసింద న్న చందంగా పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాల్సిన సిబ్బందే చేతివాటం ప్రదర్శిస్తూ, అందినంత దోచుకుంటున్నారు. ఇలా ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంది. ఈ అక్రమాలు తర్వాతి ఏడాది నిర్వహించే ఆడిట్‌లో కొంత వరకు వెలుగు చూస్తున్న విషయం విదితమే. తాజాగా జిల్లాలోని సైదాపురం, వింజమూరు మండలాల్లో ఆడిట్ మొదలవగా భారీగా ఉపాధి సొమ్ము తినేయడాన్ని గుర్తించిన అధికారులు బాధ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

**12మందిపై వేటు**

జిల్లాలో గతేడాది జరిగిన 'ఉపాధి' పనులకు సంబంధించి ఆడిట్ ప్రారంభమైంది. తొలి గా సైదాపురం మండలంలో అధికారులు ఆడిట్ నిర్వహించారు. ఆ మండలంలో రూ.8.87 కోట్ల పనులు జరగ్గా అందులో రూ.49 లక్షల మేర నిధులు తినేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆ సొమ్ము రికవరీకి నోటీసులు జారీ చేయడంతోపాటు నిధులు తినేసిన ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. అలాగే వింజమూరు మండలంలో రూ.11కోట్ల మేర పనులు జరగ్గా రూ.13.75 లక్షల నిధులను తినేసినట్లు అధికారులు తేల్చారు. ఆ నిధుల రికవరీకి నోటీసులు జారీ చేయడమేకాక ఇద్దరు టీఏలు, ఒక ఈసీ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడి అవినీతికి ఉపాధి పథకం పనులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం కావలి మండలంలో ఆడిట్ ప్రారంభమైంది. అలాగే అన్ని మండలాల్లోనూ ఆడిట్‌ను పూర్తిస్థాయిలో నిర్వహించనుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.




ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

### చౌకిచర్ల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

విడవలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : విడవలూరు మండలం చౌకిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మధుసూదన్‌రావును సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కార్యదర్శి గతంలో కొడవలూరు మండలంలోని పెమ్మారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో అవకతవకలకు పాల్పడినట్లు కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

### తాత్కాలికంగా చెక్కు పవర్ రద్దు

● కొడవలూరు : కొడవలూరు మండలంలో రేగడిచెలిక సర్పంచ్ చెక్ పవర్ ఆరునెలలపాటు రద్దు చేసినట్లు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### సీఆర్‌పాలెం కార్యదర్శి విజయకుమార్ సస్పెండ్

● బిట్రగుంట : సీఆర్‌పాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్. విజయకుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తరులు జారీ చేశారు. అధికారుల తెలిపిన వివరాల మేరకు.. 2021-24లో కొడవలూరు మండలం రేగడిచిలక గ్రామంలో పని చేస్తున్నప్పుడు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



ఇంటింటి సర్వేలో డీఎంహెచ్‌వో సుజాత, వైద్య బృందం

## కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సోమవారం నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఈ సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కుష్ఠువ్యాధిని గుర్తించడంలో నిర్లక్ష్యం వీడాలని, సకాలంలో గుర్తిస్తే నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. గుర్తించిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, వైద్యాధికారి డాక్టర్ సునీత, జిల్లా న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథరపిస్ట్ డాక్టర్ నరసింహులు, డాక్టర్ సమీరా, డాక్టర్ విష్ణుప్రియ, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు(వైద్యం, ఆంధ్రజ్యోతి)

## గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా వసూలు చేస్తే చర్యలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): దీపం-2 గ్యాస్ సిలిండర్ ధర కంటే అదనంగా నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అంకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిలిండర్‌పై అదనపు వసూళ్లకు సంబంధించి లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, అవి రుజువైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపం-2 పథకం కింద లబ్ధిదారులు ఎవరు అదనపు నగదు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు నగదు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



## రూ.9 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు : డీడీ

మనుబోలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 63 హాస్టళ్ళకు రూ.9కోట్ల పైచిలుకు నిధులతో మరమ్మతులు చేయించనున్నామని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి అన్నారు. స్థానిక ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆమె సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో ఉన్న గదులను పరిశీలించారు. భోజనం, వసతి, చదువు గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహాల మరమ్మతు పనులను పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖలకు అప్పగించామన్నారు. కలెక్టర్ అనుమతితో నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. షార్ట్‌టెండర్లు వేయించి త్వరితగతిన మరమ్మతులు చేయించాలని సూచించామన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ట్యూటర్‌లను ఏర్పాటు చేయిస్తున్నామని, వచ్చే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో బ్రహ్మానందాచారి, మ్యాట్రిన్ మహేశ్వరి, వార్డెన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వేణుగోపాలుడికి పూర్వ వైభవం

- ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం
- రూ.16.70 కోట్లతో టెండర్లు పిలిచిన దేవదాయ శాఖ
- రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా లక్ష్యం



నెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఎంతో ప్రాశస్త్యం కలిగిన శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి పూర్వ వైభవం రాబోతోంది. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల జీర్ణోద్ధరణకు దేవదాయ శాఖ నడుం బిగించింది. అందులో భాగంగా వేణుగోపాల స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. 200 ఏళ్ల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించగా, ఈ ప్రాంగణంలోనే నరసింహస్వామి ఆలయాన్ని, రాజగోపురం కూడా అప్పుడు నిర్మించినవి కావడంతో అవి కొంత దెబ్బతిన్నాయి. ఆలయం పైకప్పు ఉరుస్తోంది. కోనేరు పక్కన సీపేజీ కారణంగా గోడలు పగుళ్లిస్తున్నాయి. అంతేగాక ఈ ఆలయం రోడ్డు ఎత్తు కన్నా దిగువన ఉంది. వీటన్నిటి నేపథ్యంలో ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. ఇందుకు రూ.16.67 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇప్పుడున్న ఆలయానికి పది మీటర్లు ఎత్తు పెంచి కొత్త ఆలయాన్ని నిర్మించనున్నారు. ఆలయంలో ప్రముఖ భాగాలను విలువైన రాతి కట్టడం చేయనున్నారు. ఆధ్యాత్మికత, ఆలయ చరిత్ర ప్రతిబింబించేలా వివిధ కళా రూపాలను గోడలపై రూపొందించేలా ప్రతిపాదించారు. ఆలయం ముందు భాగం లో అనివిట్టి మండపాన్ని కూడా నిర్మించనున్నారు. అలానే ఆలయం చుట్టూ కొత్త గోడను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఆలయంలో ఉన్న విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హించిన అనంతరం బయటకు తీస్తారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకూ ఉత్సవర్లకు రోజూలాగే పూజలు నిర్వహిస్తారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక విగ్రహాలను యథాస్థానంలో పునఃప్రతిష్ఠిస్తారు. వేణుగోపాల స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి దేవదాయ శాఖ అధికారులు టెండర్లు ఆహ్వానించగా, ఈ నెల 27వ తేదీతో టెండర్ దాఖలుకు గడువు ముగుస్తుంది. ఆ తర్వాత పనులు మొదలుపెట్టి రెండేళ్లలో పూర్తి చేసే విధంగా లక్ష్యం పెట్టుకున్నారు.



క్యాలెండరు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుఖదేవస్వామి, ఇస్కాన్ కమిటీ సభ్యులు

## 1న ఇస్కాన్ రథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీన శ్రీకృష్ణ బలరామ రథయాత్ర నిర్వహిస్తున్నామని మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి తెలిపారు. సోమవారం మందిరంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇస్కాన్ గురించి రథయాత్రలో వివరించడానికి విదేశాల నుంచి ఇస్కాన్ ప్రముఖులు విచ్చేస్తున్నారని తెలిపారు. మూలాపేట అలంకార్ సెంటర్ నుంచి మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమై పెద్ద బజారు, సంతపేట, సుబేదార్‌పేట మీదుగా సాగి సర్వోదయ కళాశాల వద్ద యాత్ర ముగుస్తుందని చెప్పారు. ఇస్కాన్ మేనేజర్ రాజశేఖర్‌దాస్, డీవీఎస్ గిరి మాట్లాడుతూ రథయాత్ర ద్వారా శ్రీకృష్ణుడు, బలరాముడు భక్తుల చెంతకే వస్తున్నారని తెలిపారు. యాత్రలో జిల్లా ప్రజలు అందరూ పాల్గొనాలని కోరారు. యాత్ర ముగిసిన తర్వాత విందు భోజనం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కొట్టే రామమూర్తి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. యాత్ర కరపత్రాలు, 2025వ సంవత్సరం ఇస్కాన్ క్యాలెండర్లు ఆవిష్కరించారు.

## రోడ్డుప్రమాదంలో తల్లీకొడుకుకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై మోటార్‌బైక్ అదుపుతప్పి తల్లీకొడుకుకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. దాసరిపల్లి గ్రామానికి చెందిన పాముల అరుణ తన కుమారుడితో కలిసి మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వస్తోంది. ఈ తరుణంలో గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఓ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న అప్పసముద్రం గ్రామ ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ, ఎంఎల్‌హెచ్‌పీ సురేష్‌బాబులు వారిని గమనించి వెంటనే ప్రథమ చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## కసుమూరులో అద్దె గృహాలపై పోలీసుల దాడి

వెంకటాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు గ్రామంలోని అద్దెగృహాలపై సోమవారం ఉదయం పోలీసులు దాడులు నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు పోలీసు సిబ్బందితో కలిసి షేక్ నౌషాద్‌కి సంబంధించిన అద్దె గృహాలపై దాడిచేసి రెండు జంటలను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు నౌషాద్‌పై కేసు నమోదు చేశారు. వ్యభిచారం తదితర అసాంఘిక కార్యకలాపాలకు గృహాలు అద్దెకు ఇచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డబ్బులు ఎక్కువ వస్తాయన్న ఆశతో కొందరు గృహాలను వ్యభిచారానికి అద్దెకు ఇస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 132 |
| లేయర్ లైవ్ | 88 |
| స్కిన్ చికెన్ | 236 |
| స్కిన్‌లెస్ | 260 |
| లేయర్ | 150 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7670 |
| వెండి కిలో ధర | రూ. 93,000 |
| వెండి ఒక గ్రాము | రూ.96.00 |

## కోడూరుపాడు కల్తీకాలనీలో చోరీ

నెల్లూరురూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ పరిధిలోని కోడూరుపాడు కల్తీ కాలనీలో ఈనెల 17వ తేదీన చోరీ జరిగినట్లు రూరల్ సీఐ జీ వేణు సోమవారం తెలిపారు. ఆ ప్రాంతానికి చెందిన స్వాతీ తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు జొరబడి 3.25 గ్రాముల విలువ చేసే బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

నెల్లూరు శివార్లలోని చింతారెడ్డిపాళెం సమీపంలో గల పాతమిట్టపాళెం వద్ద రెవెన్యూ ఆధీనంలో ఉన్న భూమిలోకి అక్రమంగా ప్రవేశించినట్లు స్థానిక వీఆర్వో చెరుకూరు చిన్నధనయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దారా శివయ్య, ప్రదీప్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చేనేత సహకార సంఘాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఐదేళ్ల కాలంలో సదరు సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోగా ప్రత్యేకాధికారుల పాలనతోనే సరిపిచ్చింది. దీనికితోడు టీడీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్న నేస్తంతో చేతులు దులుపుకుంది. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపైనే నేతన్నలు ఆశలు పెట్టుకుని ఉన్నారు.

### సిబ్బంది కొరతే కారణమా!?

చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతోపాటు ఆ శాఖలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. దీంతో కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు ప్రకటించినట్లే ప్రకటించి వాయిదా వేసింది. ఈ క్రమంలో టీడీపీ హయాంలో (2014-19) కొనసాగుతున్న థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని పునరుద్దరించినా వారి చెంతకు చేరలేదు. కార్మికులకు అవగాహనలేక పథకానికి నోచుకోవడంలేదు.

### నేతన్నల ఎదురుచూపు

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారోనని నేతన్నలు ఎదురుచూస్తున్నారు. సంఘాలకు పాలకవర్గాలు ఉంటే కార్మికుల్లో స్థానికంగా చైతన్యం కల్పించి వారి అభివృద్ధికిపాటుపడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు నేతన్నల దరి చేసే బాధ్యతల సంఘాలు చేపడతాయి. నూతన నిబంధనల మేరకు కొత్త సంఘాలు ఏర్పాటు కృషి జరుగుతుంది. ఆ శాఖలో సిబ్బంది కొరతతో కార్మికులకు సహకారం అందడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నేతన్నలు కోరుకుంటున్నారు.



# ఎన్నికలు ఎప్పుడు?

- షెడ్యూలు ప్రకటించి.. వాయిదా వేశారు!
- నిస్తేజంలో చేనేత సహకార సంఘాలు
- కూటమిలోనూ ప్రత్యేక అధికారుల పాలనేనా!?

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : 2013, ఫిబ్రవరిలో అప్పటి కాంగ్రెస్ హయాంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 2018, ఫిబ్రవరి నాటికి పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. వీటి బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది. నేతన్న నేస్తంతో మిగతా పథకాలను నిలిపివేసి చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి చేనేత సంఘాలకు పునరుజ్జీవం పోసే దిశగా చర్యలు చేపట్టింది. మూడు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు ప్రకటించింది. దీంతో నేతన్నలంతా ఆనందించారు. ఇంతలో ఏమైందో ఏమో వాయిదా వేసింది. ఆ తర్వాత దాని ఊసేలేదు. షెడ్యూలు ప్రకారం నవంబరు 21న ప్రక్రియ ప్రారంభించి డిసెంబరు 6వ తేదీకల్లా పూర్తి చేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు జరిగి ఉంటే ఈపాటికి కొత్త పాలకవర్గాలు కొలువుదీరి ఉండేవి.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఆడిట్

- 19 మంది అధికారుల నియామకం
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి
- 'పరిష్కార వేదిక'కు 405 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాధపురం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కా రం కోసం ఆడిట్ చేస్తున్నామని కలెక్టర్ ఓ ఆనంద్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారాన్ని ఆడిట్ చేయడానికి 19 మంది జిల్లా అధికారు లను నియమించామని చెప్పారు. ఈ అధికారులందరూ అందిన అర్జీల పరిష్కారం నాణ్యతగా జరుగుతుందో లేదో ఆడిట్ చేయాలన్నారు. ఆడిట్ చేసిన వాటిలో కొన్నింటిని తన పరిశీలనకు పంపాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తు న్నాయ ని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌వో ఉదయభాస్కర్ రావు, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, సోమవారం జరిగిన ఈ పరిష్కార వేదికలో ప్రజలు 405 అర్జీలను అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబధించి 163, పోలీస్ శాఖకు సంబంధించి 73, సివిల్ సప్లయిస్‌కు సంబంధించి 7 అర్జీలు వచ్చాయి.

### రేషన్‌కు ముందే పైకం చెల్లించాలి

ముందుగా పైకం చెల్లిస్తేనే ఎండీయూ వాహనదారులకు రేషన్ సరు కులు అందజేస్తామని, లేకపోతే మార్చి 1వతేదీ నుంచి వారికి సరుకులు ఇవ్వమని తెలియజేస్తూ ది నెల్లూరు నగర చౌక ధరల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేగు కుమారస్వామి జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్ సరుకులకు ఎండీయూ వాహనదారులు ముందుగా డబ్బు చెల్లించి సరుకులు తీసుకునే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

### మైపాడు బీచ్‌లో సౌకర్యాలు కల్పించాలి

మైపాడు బీచ్‌లో పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బీజేపీ నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు సముద్రంలో అలల తాకిడి గురై ఒడ్డుకు రాలేక ప్రాణాలు కోల్పోతున్నారని వెంటనే అక్కడ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అక్కడ అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని, గస్తీ ముమ్మరం చేయాలని కోరారు.

### అంబేడ్కర్ భవన్‌ను బాగు చేయండి

నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో కనీస వసతులు లేవని, ఆ భవనానికి మరమ్మతులు చేయించి అందంగా తీర్చిదిద్దాలని కోరుతూ మాలమహానాడు జిల్లా అధ్యక్షు డు వాదనాల వెంకటరమణ కలెక్టర్‌కు అర్జీ సమర్పిం చారు. పేదలు వివాహాలు చేసుకునే అలాంటి భవనంలో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు.

## బాధితుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- ఏఎస్పీ సౌజన్య



మహిళతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 97 మంది సమస్యలను వెల్లడించారని చెప్పారు. వాటిపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు.

కాగా, మక్కా యాత్ర (ఉమ్రా)కు పంపుతానని నగదు వసూలు చేసి మోసం చేసిన ఆడిటర్ అనీస్ నుంచి తమ నగదు, పాస్‌పోర్టులు ఇప్పించా లని కోరుతూ ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ బయట బాధిత ముస్లింలు నిరసన తెలిపారు. 27 మంది నుంచి రూ.55 వేలు చొప్పున రూ.14.85 లక్షలు తీసుకొని మోసం చేశాడని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.

## 'సోమశిల'కు 1,901 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం/రాపూరు (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 1,901 క్యూసెక్కుల ప్రవాహం కొనసా గుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 69.322 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరు డ్యాంకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ఇక, కండలేరు డ్యాంలో ప్రస్తుతం 55.6 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 180 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1205 క్యూసెక్కులుగా ఉంది.



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ నాయకులు

## జిల్లాల వారీగా కార్యనిర్వహక కమిటీలు

- ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సర్వోదయ మండల్ కార్యాచరణ సేవా కార్యక్రమాలు విస్తరిస్తున్నట్లు ఆ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంబాబు తెలిపారు. సోమవారం నెల్లూరు మూలాపేటలోని ఓ హోటల్‌లో నెల్లూరు, చిత్తూరు సర్వోదయ మండల్ శాఖల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో సర్వోదయ మండళ్లకు జిల్లా కమిటీలు వేస్తున్నామని చెప్పారు. ప్రజల్లో దేశభక్తిని పెంచడానికి కమిటీలు కృషి చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలు, ఆశయాలపై సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండరు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నెల్లూరు శాఖకు అధ్యక్షుడిగా సాదేపల్లి ప్రేమకుమార్, జిల్లా ప్రతినిధిగా జీ అంకయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా రుద్రపాటి రత్నంరాజు, జనరల్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రాజు, జాయింట్ సెక్రటరీగా సునీల్, శామ్యూల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సునీల్, కోశాధికారిగా సాదేపల్లి వేదాంతకుమార్, బీఆర్వోగా గుంజి కృష్ణ, కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. వారితో పదవీ బాధ్యతల స్వీకార ప్రమాణం చేయించారు. చిత్తూరు జిల్లా కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కన్వీనర్, సర్వసేవా సంఘ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జి మహమ్మద్ హుస్సేనీ ఫరీద్ షేక్, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వీ లత, కార్యనిర్వాహక కార్యదర్శి గోగు రవికుమార్, మహిళా సమితి కన్వీనర్ దత్త మణి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ భవన నిర్మాణంపై చర్యలు తీసుకోండి!

- కమిషనర్‌కు టీడీపీ నాయకుల వినతి

నెల్లూరు (సిటీ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణమని తేల్చిన భవనంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయ కులు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రం అందచేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో టీడీపీ నేత, మాజీ కార్పొరే టర్ భువనేశ్వరీప్రసాద్ నేతృత్వంలోని నాయకుల బృందం లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. బాలాజీనగర్‌లోని రోడ్డు విస్తరణ స్థలంలో నిర్మించిన వాణిజ్య భవనానికి అనుమతులు లేవన్నారు. దీనిపై ఈ నెల 13వ తేదీన నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. 16వ తేదీన మంత్రి నారాయణ సమీక్ష సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించి చర్యలు తీసుకో మని ఆదేశించినా అధికారుల్లో చలనం లేదని పేర్కొన్నారు. ఈ అక్రమ కట్టడంపై ఆంధ్రజ్యోతిలో వివరణాత్మకంగా కథనం ప్రచురితమైందని గుర్తు చేశారు. ఈ అక్రమ నిర్మాణంపై వేగవంతంగా చర్యలు తీసుకో వాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకునే కసర త్తు జరుగుతోందని తెలిపారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

# శివారుల్లోనే చెత్తకుప్పలు

- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- దృష్టి సారించని అధికారులు

ఉలవపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు ఉలవపాడు, కరేడు మేజర్ పంచాయతీల్లో పారిశుధ్యం కొరవడింది. ప్రధానంగా ప్రధానరోడ్డు వెంట ఉన్న కూరగాయలు, పండ్ల అంగళ్లు, వ్యాపారులు, తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు నిర్వహించే వారంతా సాయంత్రానికి గ్రామశివారు రోడ్డు పక్కనే చెత్తంతా ఇష్టానుసారంగా పడేస్తుంటారు. ఉదయాన్నే పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రెండు ట్రాక్టర్లతో దాన్ని ఎత్తి ఊరుబయటకు తరలిస్తున్నారు. గ్రామానికి దక్షిణం వైపు పెట్రోల్ బంక్ సమీపంలో రూ.8లక్షలతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో డంపింగ్‌యార్డ్ నిర్మించారు. ప్రస్తుతం ఇది వాడుకలో లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నది. సేకరించిన చెత్తను గ్రామానికి ఉత్తరం వైపు ఎంపీడీవో కార్యాలయంకు కూతవేటు దూరంలో జాతీయ రహదారి చిల్లాకాలువ బ్రిడ్జి కింద డంప్ చేసి తగలపెడుతున్నారు. అలాగే డంపింగ్ యార్డ్ బయట రోడ్డుకు ఇరువైపులా చెత్తను కుప్పలుకుప్పలుగా పోశారు. కరేడు మేజర్ పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సేకరించిన చెత్తను రామకృష్ణాపురం ఎస్టీ కాలనీకి దగ్గరలో డంప్ చేయడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో గ్రామాల శివారులో దుర్గంధం వెదజల్లుతుంది. వీటిలో కుళ్లి కూరగాయలతో పాటు ఇతర వ్యర్థాలను పారవేస్తుండటంతో కుళ్లి దుర్వాసతో ముక్కులు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే పొడి, తడి చెత్త బుట్టలు ప్రతి పంచాయతీకి వందల లెక్కన వచ్చాయి. కొన్ని ఎంపీడీవో కార్యాయం, మరికొన్ని కరేడు పాత పంచాయతీ కార్యాలయంలోని స్టోర్ రూం లకే పరిమితం అయ్యాయి. చెత్త సేకరణ రిక్షాలు నమూనాలుగా మిగిలిపోయాయి.


ఉలవపాడు శివారులోనే వేసిన చెత్తాచెదారం

# నూరు శాతం లక్ష్య సాధనకు కృషి
రవిశంకర్‌రెడ్డి, ఏపీఎం



ఇంటర్వ్యూ...

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యుల నుంచి రుణ రికవరీ నూరు శాతం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఏపీఎం ఎస్ రవిశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

**? ఎన్ని పొదుపు సంఘాలున్నాయి. బ్యాంక్ లింకేజీ రుణాలిస్తున్నారా.**

! 20 పంచాయతీల్లో 991 సంఘాలున్నాయి. వాటిలో 10,004మంది సభ్యులు ఉన్నారు. 2024-25లో 756 సంఘాలకు బ్యాంక్ లింకేజీ లక్ష్యం రూ. 31.5 కోట్లు.

**? ఎన్ని సంఘాలకు రుణాలిప్పించారు. ఎంత శాతం రికవరీ ఉంది.**

! 411సంఘాలకు ఇప్పటి వరకు 25.61కోట్ల మేర బ్యాంక్ లింకేజీలను మార్చి నెలాఖరులోపు పూర్తిచేస్తాం. రికవరీ 99.7శాతం ఉంది.

**? స్త్రీనిధి కింద ఎంతమందికి రుణాలు ఇచ్చారు. రికవరీ శాతం ఎంత చేశారు.**

! 1000 మంది సభ్యులకు రూ.5కోట్ల రుణం ఇవాలని లక్ష్యం. ఇప్పటివరకు 424 మంది కి రూ.2.72కోట్ల మేర రుణాలు అందచేశాం. రికవరీ 93 శాతం ఉంది. ఒక్కొక్కరికి వారు ఏర్పాటుచేసే యూనిట్‌ను బట్టి రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఇచ్చాము.

## న్యూస్ బాక్స్

### నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రాహూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం,దగదర్తి ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను సెల్:9959225643కు ఫోన్‌చేసి తెలపాలని పేర్కొన్నారు.

### ఆర్థికసాయం

అల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వీధిలోని కాలాపల్లి రామలింగేశ్వరరావు (36)మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కెఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం సోమవారం కుటుంబసభ్యులకు రూ.3వేలు అందజేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ కందల రాజారెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం సాయం అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

### ఎలుకల నివారణ మందు పంపిణీ

సంగం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు ప్యాకెట్ల రూపంలో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మాట్లాడుతూ వరి వెన్నుదశలో ఉనప్పుడు ఎలుకలు కొట్టేస్తుంటాయని, నివారణకు ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా ఉచితంగా మందు అందచేస్తుందని తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### చట్టాలపై అవగాహన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రఘునాథ్ అన్నారు. సోమవారం వాక్తన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి జాతీయ రహదారిపై బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### చెట్లలోకి దూసుకెళ్లిన కారు

అనంతసాగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన ఉప్పలపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. సోమశిల వైపు నుంచి అనంతసాగరానికి వస్తున్న కారును అనంతపురం నుంచి పెంచలకోనకు వెళ్తున్న తుఫాన్ కారు ఢీకొంది. దీంతో పడమటి కంబపాడుకు చెందిన పెంచలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కార్లు చెట్లలోకి దూసుకెళ్లాయి.



# భూముల రీ సర్వే మొదలు

జలదంకి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన చామదలలో సోమవారం ఉదయం రీ సర్వే డీటీ శ్యాంసన్, సర్వేయరు శోభన్, వీఆర్‌వో, వీఏఏలు ఈ రీసర్వేను మొదలుపెట్టారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేపట్టి భూ యజమానులు, ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. కేంద్రం ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్ట్ పేరుతో సమగ్ర భూ సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రీసర్వే అంతా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం అనేక జాగ్రత్తలు చేపట్టిందన్నారు. భూ యమానిని దగ్గర పెట్టుకుని రీ సర్వే కొలతలు తీసి సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో భూ యజమానులు, నాయకులు దేవరపల్లి క్రిష్టారెడ్డి, మునగాల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

- **భూ రీసర్వేకు సహకరించాలి**

బిట్రగుంట: భూ రీసర్వే కార్యక్రమంలో పని చేస్తున్న అధికారులకు రైతులు సహకరించాలని మండల తహసీల్దారు సురేష్‌బాబు అన్నారు. సోమవారం కోవూరుపల్లిలో రీసర్వే ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు, మండల సర్వేయరు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు నాటక రాణి శీనయ్య, సుధీర్‌బాబు, రంగయ్య, వీఆర్వోలు దొరసానమ్మ, బాలనరసింహులు ఉన్నారు.


పొలంలో సర్వే చేస్తున్న అధికారులు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు సురేష్‌బాబు

# ఇన్సూరెన్స్ చేయించుకున్న ప్రతిఒక్కరికీ పరిహారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేజర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ముంచిన ముసురు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మండలవ్యవసాయశాఖ అధికారి శశిధర్ మాట్లాడుతూ చేజర్ల మండలంలో 736ఎకరాల వరకు మినుము పంట సాగు చేశారు. ఇప్పటికే తెగుళ్ల సోకిన పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసినట్లు తెలిపారు. అయితే పంటకు ఇన్సూరెన్స్ చేయించుకున్న ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా రంగు మారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

# కేవీకేలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో నిరుద్యోగ యువతకు పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై 6రోజుల నైపుణ్య శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఆత్మ సౌజన్యంతో నిర్వహించే శిక్షణకు కేవీకే హెడ్ డాక్టరు ప్రసాద్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన శిక్షణలో ప్రకాశం జిల్లా వ్యవసాయాధికారి, ఆత్మ పీడీ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. దేశంలో పండిస్తున్న పండ్లు, కూరగాయల్లో వృథాతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై తగిన అవగాహన, మౌలిక సదుపాయాలు లేవన్నారు. అనంతరం ఆత్మ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడారు. శిక్షణ తీసుకున్న యువత పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా లేదా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రాజెక్టును సమర్పిస్తే సబ్సిడీ రుణాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ నిహారిక మాట్లాడారు. ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ తీసుకుని విలువ ఆధారిత ఉత్పత్తులు జామ్, జెల్లీ, స్క్వాష్, పికెల్స్ సాస్, కేచప్, బిస్కెట్లు, కేకులు తయారు చేసి ఉపాధి పొందవచ్చన్నారు. శిక్షణకు హాజరైన యువతకు పదార్థాల తయారీపై బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్, కేవీకే శాస్త్రవేత్త వెంకటేష్, అధ్యాపకులు అనూష, బాలూనాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆత్మ పీడీ శ్రీనివాసరావు

# ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలి


ప్రచారపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి


సంగం: బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న ఎంవీఐ రాములు, ఎస్ఐ రాజేష్

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతిఒక్కరూ పాటించడం సామాజిక బాధ్యతగా అలవర్చుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రచార పత్రాలను సోమవారం ఆమె ఆర్టీఓటీ వీఎస్.లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 15వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం, ఎంవీఐ సీహెచ్ రాంబాబు, సీఐ వెంకటేశ్వరరావు, ఏఎంవీఐ లక్ష్మీబాయి, ఎస్ఐలు సాంబశివరావు, బీబీ మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

- కలిగిరి: పట్టణంలో విద్యార్థులతో కలిసి సీఐ వెంకట రమణ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమాశంకర్, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- సంగం: ఎంవీఐ రాములు, ఎస్ఐ రాజేష్‌తో కలిసి సంగం నుంచి మర్రిపాడు వరకు ముంబయి జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు, వెనుక కూర్చున్నవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, కారులో ప్రయాణంలో సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు.
- కావలి: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, ఆర్టీవో సుధాకర్ రెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర రావులు ఆవిష్కరించారు. రహదారి భద్రతలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ముసునూరు జాతీయ రహదారి, కావలి బ్రిడ్జికూడలి సెంటర్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలపై చర్చించారు.


కావలి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, ఆర్టీవో, ఎంవీఐ తదితరులు

# టీఆర్ఆర్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీగా అర్హత కలిగిన వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ మ్యాథమ్యాటిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలైతే 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఆయన తెలిపారు. బోధనానుభవంతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. గంటకు రూ.400 చొప్పున నెలకు గరిష్టంగా రూ. 28వేలు వరకు వేతనం అందజేస్తామన్నారు. 27న ఉదయం 11గం టలకు జరిగే ఇంటర్వ్యూ, డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

# తూతూమంత్రంగా మండల సమావేశం

కొండాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల కార్యాలయంలో సాదాసీదాగా జరిగింది. మూడునెలల కాలంలో వెలుగు, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, పశుసంవర్ధకశాఖ, హౌసింగ్ తదితర శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో ఆదినారాయణ సమీక్ష నిర్వహించారు. గుడవల్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచర్ల మాట్లాడారు. జలజీవన్ మిషన్ పైపులైన్ల లీకేజీతో కొన్నిప్రాంతాల్లో మురుగుకుంటలను తలపిస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో ను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

# మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాట్లపై అవగాహన

కొండాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరంలో ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాట్లపై సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో 1-2 రవికుమార్, ఆనందరావులు అవగాహన సమావేశం నిర్వహించారు. జీవో నెంబరు 117ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొమ్మి, కొండాపురం, తూర్పుఎర్రబల్లి, సాయిపేట కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఉదయగిరి: జీవో నెంబర్ 117 ఉపసంహరణ, పాఠశాల సముదాయాల పునర్వ్యవస్థీకరణపై స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయుల అభిప్రాయ సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎనిమిది పాఠశాలల సముదాయాలకు గాను నాలుగు పాఠశాలల సముదాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలు, హైస్కూల్స్ ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపే విషయమై ఆర్‌జేడీ, డీఈవో వెబెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.
- కావలి టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకే ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం తలపెట్టిందని ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య తెలిపారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్ ఎంటీఎస్‌లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 6,7 తరగతుల పిల్లలు 30 మందికి తక్కువగా ఉంటే పాఠశాలను డీగ్రేట్ చేసి 1నుంచి 5తరగతుల బేసిక్ స్కూల్‌లో విలీనం చేయడం జరుగుతుందన్నారు. 6,7,8 తరగతుల పిల్లలు 60కంటే ఎక్కువమంది ఉంటే హైస్కూల్‌గా మారుతుందన్నారు.


కొండాపురం: మాట్లాడుతున్న ఎంఈవో-2 ఆనందరావు


ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 శ్రీనివాసులు

# పీఎం సూర్య ఘర్ సద్వినియోగం చేసుకోండి

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిస్కమ్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సతీష్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మండలంలో సుమారు రూ.3.5లక్షల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వెంటనే చెల్లించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు పీఎం సూర్య ఘర్ పథకంలో నూరుశాతం రాయితీతో సౌర ఫలకలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ, ఎస్సీలు వారి ఆధార్ నెంబరు, విద్యుత్ సర్వీసు, మొబైల్ నెంబరు అందచేస్తే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. తరువాత ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ మన్మధరావు ఉన్నారు.

# ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలం ఉండి కాలనీ ఇళ్ల కావలసిన వారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఎం గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ దరఖాస్తుదారులు భార్యా, భర్త ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకంను దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు స్థలానికి పొజిషన్, ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికేట్ మంజూరు చేస్తారన్నారు. తద్వార కేంద్రం సూచించిన యాప్‌లో నమోదు చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన ఎస్టీ కుటుంబాల నివాసాలకు కాలనీ ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. ఎస్టీ కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఫర్నీచర్ వితరణ

ఉదయగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కంభాల నరసమ్మ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు రమణమ్మ, నరసయ్యలు సోమవారం ఫర్నిచర్ వితరణ చేశారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయినులు ఆదిలక్ష్మీదేవి, ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

### దుస్తుల పంపిణీ

కావలి టౌన్, జనవరి 20: స్థానిక వెంగళరావునగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. దాతలు కృష్ణయ్య ప్రభావతి దంపతుల సహకారంతో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ రోటరీక్లబ్ అధ్యక్షుడు దినేష్ పాల్గొని దాతలను అభినందించారు. ఆర్భాటాలకు నగదును వృథా చేసుకూదన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, రఘుకుమార్ రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

# కుష్ఠు వ్యాధి నిర్ధారణపై ఇంటింటా సర్వే

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్ధారణపై ఇంటింటి సర్వే సర్వే ప్రారంభించారు. స్థానిక వైద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో తిరుమనతిప్ప కాలనీలో సర్వే చేశారు. సర్వే ఫిబ్రవరి 2వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్ పాల్గొన్నారు.

- కలిగిరి: క్రాకుటూరులో జరుగుతున్న కుష్ఠువ్యాధి క్యాంపెయిన్ సర్వేను వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు లెప్రసి(క్షయ) వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ క్షయ నిర్ధారిత పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనుమానిత కేసులుంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కలిగిరి: క్షయ నిర్ధారిత పరీక్ష నిర్వహిస్తున్న బిజ్జం గీతారెడ్డి

# ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తాం

కందుకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్‌సేవలను సంపూర్ణంగా అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 21న కృష్ణబలిజసంఘం, బూడిదపాలెం దర్గా ఏరియా, 22న గుర్రంవారిపాలెం, సాయినగర్ 23న ఆదిఆంధ్ర కాలనీ, బూడిదపాలెం 24న యానాదిపాలెం, కోటకట్ట వీధిలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

- కావలి: పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు పిల్లల వివరాలను మీ పరిధిలోని సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీని క్రియేట్ చేస్తున్నారని అందులో వివరాలు సరాగి ఉండటం లేదన్నారు. ఈ సమస్యతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవన్నారు. ఐదేళ్ల పిల్లల ఆధార్ కార్డులను ఆధార్ సెంటర్‌లో తల్లితండ్రులు అప్‌డేట్ చేయించుకుని, ఫోన్ నంబర్లు అనుసంధానం చేయాలన్నారు.

# అధ్యాపకురాలికి జాతీయ ప్రతిభా అవార్డు

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కప్పల పుష్పమ్మ సావిత్రి బాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణస్వామి తెలిపారు. ఆదివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాకుడు నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో పుష్పమ్మ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు.



అవార్డు అందుకుంటున్న పుష్పమ్మ

# ప్రజలు ఛీ కొట్టినా.. కాకాణికి బుద్ధిరాలేదు

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా కాకాణికి బుద్ధిరాలేదని కావలి పట్టణ, బోగోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ క్రిషోర్, మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో కోళ్లదిన్నె బాధితులతో కలిసి వారు మాట్లాడారు. నిత్యం రోగులతో కిటకిటలాడే కావలి ఏరియా వైద్యశాలలోకి కోళ్లదిన్నె వైసీపీ నేతలు మారణాయుధాలతో వచ్చి భయకంపితులు చేస్తుంటే అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, సానుభూతిపరులు అడ్డుకోవటం తప్పా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డిలకు లేదన్నారు. బాబూరావు, సుదీర్, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, దావులూరి దేవకుమార్, కోడూరు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకారెడ్డి, రావి విజయ్, హర్ష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషోర్‌బాబు, నాగేశ్వరరావు, జ్యోతి బాబురావు

# ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో షాలెట్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పరిసరాల పరిశుభ్రతకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న తాగునీటి సమస్యకు ప్రస్తుత తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ శాశ్వత పరిష్కారం చూపారు. కార్యాలయం ముందు ఉన్న పాడుబడిన మంచినీటి బావిలో పూడికను తీయించారు. బావిపై ఇనుప మెస్ వేయించి బావికి విద్యుత్ మోటారు బిగించి పైపులైన్ల ద్వారా కార్యాలయంలోకి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బావి చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించారు.

# కోనేరు మార్కెట్ దుకాణాల వేలం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన కోనేరు మార్కెట్‌లోని 140 దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో 152 మంది దరఖాస్తు చేసుకోగా 71 దుకాణాలకు వేలం పూర్తయింది. అయితే తమకు అన్యాయం జరుగుతోందని నెల్లూరు సిటీ ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు రఫీ నిరసన తెలిపి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విచారించి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

● మార్కెటింగ్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఏఎంసీ కార్యాలయంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీలకు పౌరసరఫరాలశాఖ నుంచి రావాల్సిన బకాయిలను వసూళ్లు చేసేందుకు ప్రయత్నించాలన్నారు.

# హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి : డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్య చికిత్సలు అందించేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.సుజాత పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో ఆశా నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గర్భిణులను గుర్తించి 12 వారాల లోపు టీడీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 వారాల పాటు వారికి వైద్య సేవలు అందించాలని బిడ్డకు 3,6,9,12,15 నెలల వయస్సులో వారి ఎదుగుదలకు తగిన సేవలు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 'కోసూరు'కు ఇండోనేషియా ప్రభుత్వ పురస్కారం


ఇండోనేషియా ప్రభుత్వ ప్రతినిధుల నుంచి పురస్కారం అందుకుంటున్న కోసూరు రత్నం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం ఇండోనేషియా ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్ పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాత్రి ఇండోనేషియా బాలి నగరంలో జరిగిన 47వ కల్చరల్ వేడుకల్లో సామాజిక సంఘ సేవ నేపథ్యంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. కల్చరల్ ఫెస్టివల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండోనేషియా డెమోక్రటిక్ ప్రభుత్వ డైరెక్టర్‌ని నయోమాన్‌సీ, ఇండోనేషియా ప్రభుత్వ చీఫ్ పల్లవానియో, సాంస్కృతిక శాఖ చీఫ్ దేవోనిసా తదితర అధికారులు పాల్గొని ఈ అవార్డు ప్రదానం చేశారు.

# ప్చ్.. ఏం బాగోలేదు..!

● అన్న క్యాంటీన్‌లో నాణ్యతపై అసంతృప్తి
● రుచి మారకుంటే
మీరు మారిపోతారని కమిషనర్ వార్నింగ్


అన్న క్యాంటీన్లో అల్పాహారం తింటున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏమిటండీ ఇదీ..? ప్చ్.. రుచి ఏం బాగోలేదు.. టిఫిన్ ఇలాగేనా ఉండేది.. ఇప్పటికి ఎన్నిసార్లు చెప్పాను.. ఒక్క రోజు టైం ఇస్తున్నా.. రేపు మళ్లీ వస్తా.. రుచి మారకపోతే మీరందరు మారిపోతారు.. గుర్తుపెట్టుకోండంటూ ఎన్‌ఎంసీ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్న క్యాంటీన్లలోని సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. సోమవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన రామలింగాపురంలోని అన్న క్యాంటీన్‌లోకి వెళ్లి అల్పాహారం తిన్నారు. నాణ్యత బాగోలేదని గుర్తించి అక్కడున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట నోడల్ అధికారులు ఉన్నారు.

● టిడ్కోల్లోనే సచివాలయాలు

నగర పరిధిలోని టిడ్కో గృహాల్లోకి వస్తున్న పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు సత్వరం సచివాలయాలను అక్కడే ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వివిధ రకాల పన్ను వసూళ్లపై రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో పలు విషయాలపై ఆయన సమీక్షించారు.

● మేయర్ పరామర్శ

ఎన్‌ఎంసీలో చెత్తసేకరణ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్న చెరుకూరు సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మేయర్ పొట్లూరి స్రవంతి పరామర్శించారు. ఆయన కుటుంబానికి నెల్లూరు కార్పొరేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఫిలాసఫీలో రాజేష్‌కు డాక్టరేట్

నెల్లూరు(విద్య), జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడై నెల్లూరు రూరల్ మండలం ములుమూడికి చెందిన రాజేష్‌కు ఫిలాసఫీలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ఏఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్హాన్స్‌మెంట్ ఇన్ రెన్యువబుల్ ఇంటిగ్రేటెడ్ స్టాండలోన్ సిస్టమ్ అనే అంశంపై పరిశోధన చేసి ఎస్వీ యూనివర్శిటీ ఈఈఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఏ.లక్ష్మీదేవి పర్యవేక్షణలో పరిశోధన పత్రాలు సమర్పించారు. దీంతో డాక్టరేట్ అందుకున్న రాజేష్‌ను ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్, తదిరలు అభినందించారు.

## టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు

వెంకటాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మందల మోహన్‌రావు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని వేదాయపాలెంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా సభ్యత్వ నమోదు పత్రాన్ని మోహన్ రావు అందుకున్నారు.

# కుష్టు సర్వే ప్రారంభం


కుష్టు వ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరురూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గుడిపల్లిపాడులో జరుగుతున్న కుష్టు సర్వేను జిల్లా అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి సోమవారం పరిశీలించారు. ఇంటింటి సర్వే చేస్తున్న విధానంపై ఆరా తీశారు. ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జాబితాలో వివరాలుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు హజరత్‌రెడ్డి, బలరామనాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట(ఆంధ్రజ్యోతి): జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టు వ్యాధిపై వైద్యులు, సిబ్బంది సోమవారం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదరవలి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎల్‌డీ కంప్యూటర్ మహేష్‌కుమార్, సీహెచ్ఓ నందిని ఉన్నారు.

● వెంకటాచలం(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు గ్రామంలో సోమవారం కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించారు. కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవల్లిక ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి సర్వే చేశారు.

● పొదలకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తిలో సోమవారం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వి నరసింహారావు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె శ్రీనివాసులు, మహమ్మదాపురం పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున, ఆరోగ్య సహాయకులు యు పెంచలమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చెస్ క్రీడాకారుడుకి అభినందనలు


క్రీడాకారుడిని అభినందిస్తున్న చెస్ సంఘం ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన జాతీయ చెస్ క్రీడాకారుడు హరిరామ్ 15వ చెన్నై ఓపెన్ అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు, దీంతో సోమవారం నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు సమీపంలో ఉన్న శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీలో అతనిని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ ఇందుకూరుపేట జీవీకే చిన్నయా విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న పెరిచెర్ల హరిరామ్ సాయికృష్ణ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడంతో పాటు ఫిడే టైటిల్స్ క్రీడాకారులతో తలపడ్డారన్నారు. ప్రధానంగా అమెరికాకు చెందిన గ్రాండ్ మాస్టర్ రాసెట్ జియాటినోవ్‌పై విజయం సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, న్యాయవాది సీతారామాంజనేయ ప్రసాద్, తల్లిదండ్రులు దీప్తిసరోజ, ఉదయ్‌భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సుంకర ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి

నెల్లూరు(విద్య), జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాకర్స్ సంఘాల వ్యవస్థాపకుడు, వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసిన దివంగత సుంకర ఆళ్వార్‌దాస్‌కు పలు వాకర్స్ సంఘాల నేతలు సోమవారం ఘన నివాళులర్పించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్, వివేకానంద వాకర్స్ అసోసియేషన్‌ల నేతలు పూలమాలలు వేసి ఆయన అడుగుజాడల్లో నడుస్తామని, ఆయన ఆశయాలు కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 1986లో విశాఖలో స్నేహితులతో కలిసి ఆళ్వార్‌దాస్ ప్రారంభించిన వాకర్స్ ఉద్యమం నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి 1600 క్లబ్‌లతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పోతోలు సత్యనారాయణ, టి.సురేష్‌కుమార్, వేలూరు రంగారావు, కిలారి తిరుపతినాయుడు, చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, నలుబోలు బలరామయ్య నాయుడు, నేతలు డీవీ.సుబ్బరాజు, దాసరి అనంత రామారావు, సాంరాం, స్వర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుడిని పరామర్శించిన మంత్రి ఆనం



బాల్యమిత్రుడు సత్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న తన బాల్యమిత్రుడు కొండా సత్యనారాయణ గుప్తాను సోమవారం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. నగరంలోని నవాబుపేట లక్ష్మీపురంలో ఆయన స్వగృహానికి మంత్రి వెళ్లి ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. ఆయన వెంట నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

కోవూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాళెంలో సోమవారం శివపార్వతుల కల్యాణంను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. శ్రీశైలం నుంచి ప్రత్యేకంగా శివపార్వతుల ఉత్సవమూర్తుల్ని తీసుకువచ్చి పూజలు చేసి గ్రామోత్సవం చేపట్టారు. ఉత్సవంలో టీడీపీ నాయకుడు తిరుమూరు అశోక్‌రెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డీఎస్పీ


రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

వెంకటాచలం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరులో సోమవారం రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మొబైల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చాలా ప్రమాదకరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు పీ సుబ్బారావు, రవినాయక్, వేణు, శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ అంజనేయులు తదితరులున్నారు.

## కసుమూరులో కార్డన్ సెర్చ్

మండలంలోని కసుమూరులో నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అద్దెగృహాలు, ఇళ్లను తనిఖీచేసి కొత్త వ్యక్తులను ప్రశ్నించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# మహాసభల విజయవంతానికి ప్రచారజాతా


కోవూరులో జరిగిన ప్రచారంలో జొన్నలగడ్డ వెంకమరాజు, గండవరపు శేషయ్య, బాబు, బుజ్జయ్య


బుచ్చిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కోవూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగనున్న సీపీఎం రాష్ట్రమహాసభల్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు సోమవారం పట్టణంలోని మైథిలీకూడలిలో ప్రచారజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో పలు కీలకనిర్ణయాలు తీసుకోనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గండవరపు శేషయ్య, గండవరపు బుజ్జయ్య పాల్గొన్నారు.

**సమస్యలపై ఉద్యమాలకు సిద్ధమవ్వాలి**

బుచ్చిరెడ్డిపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా నాయకులు ముత్యాల గుర్నాథం పిలుపునిచ్చారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లాలో జరుగుతున్న ప్రచారజాత సోమవారం బుచ్చికి చేరుకుంది. ఈ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. జిల్లా నాయకుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడారు. ఉపాధి పనిదినాలు పెంచి వారికి జీనోపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలపై అధిక భారం మోపిందన్నారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో ఎంపీటీసీకి పరామర్శ


బాధితుడు వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్తుకూరు మండలం బిట్ 2 ఎంపీటీసీవెంకటేశ్వర్లను వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం జీజీహెచ్‌కు చేరుకున్న కాకాణి బాధితుడికి అందుతున్న వైద్య చికిత్సలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలని అన్ని రకాల ఇబ్బందులకు గురిచేస్తూ విధ్వంస పాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీటీసీ వెంకటేశ్వర్లుపై హత్యాయత్నం జరిగిందన్నారు. ఈ స్థితిలో నామ మాత్రపు కేసులు పెట్టి వదిలేస్తారా అంటూ ప్రశ్నించారు.

# దోర్నాలకు రెబల్‌స్టార్ కృష్ణంరాజు అవార్డు


అవార్డు అందుకుంటున్న హరిబాబు, వేదికపై ఎమ్మెల్యే రామచంద్రనాయక్, గజల్ శ్రీనివాస్

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సినీ, టీవీ హాస్యనటుడు నెల్లూరీయుడు దోర్నాల హరిబాబుకు రెబల్‌స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కారం-2025ను అందజేశారు. తెలుగు చలనచిత్ర కథానాయకుడు దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్ సురవరం ప్రతాప్‌రెడ్డి కళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఎమ్మెల్యే రామచంద్రనాయక్, గజల్ శ్రీనివాస్, సినీ నటులు కృష్ణుడు, గౌతంరాజులు అందజేశారు.

## 363 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నెల్లూరురూరల్,0(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్లో గుర్తించిన 363 మంది నిరక్షరాస్యులను 36 కేంద్రాల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ తెలిపారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో పొదుపు గ్రూపుల వీవోఏలకు 'ఉల్లాస్' పుస్తకాలను ఏపీఎం సీహెచ్ రోజ్‌మేరీతో కలసి అందచేశారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ రాజశేఖర్, సీసీలు పాల్గొన్నారు.

## రూ.2లక్షల బీమా చెక్కు పంపిణీ

నెల్లూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పడారుపల్లిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో సోమవారం ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంకు సంబంధించిన రూ.2లక్షల చెక్కును బ్యాంకు ఖాతాదారుడికి అందచేసినట్లు బ్రాంచ్ మేనేజర్ డి.అజయ్‌భాస్కర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కల్లూరుపల్లికి చెందిన ఖాతాదారు దుగ్గిశెట్టి సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతురాలి భర్త కోటేశ్వరరావుకు ఈ చెక్కు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల ఆర్‌పీ లక్కాకుల జ్యోతి, బ్యాంక్ క్యాషియర్ సిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అదనపు ఉత్పత్తితో ఆదాయం

కోవూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై సోలార్ పలకలు అమర్చుకుని గృహఅవసరాలకు మించి విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని ఆదాయం పొందవచ్చని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌చౌదరి తెలిపారు. వేగూరులో సోమవారం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్రం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకంతో విద్యుత్ బిల్లులు ఇబ్బందులు ఉండవన్నారు. అదనపు ప్రతిఒక్కరూ గృహావసరాలకు సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు మధుసూదనరెడ్డి, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## 25న శ్రీనివాస కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం వేదగణపతి ఆలయం వద్ద ఈనెల 25వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణానికి సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని పేర్కొన్నారు. దేవుడి పూజకు పూలు, పండ్లు, సమర్పించుకోవచ్చని తెలిపారు.

## రెడ్‌క్రాస్‌లో ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

నెల్లూరు(వైద్యం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెడ్‌క్రాస్ పాలకవర్గంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ పాశం నరసింహారావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న వ్యక్తులను పాలకవర్గం నుంచి తొలగించాలన్నారు. రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి జమా ఖర్చుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## నిరుద్యోగులు ఆందోళన చెందవద్దు : గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అన్ని ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తవెల్లంటిలో ఆయన గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు.

## 4 రోజులుగా అందని తాగునీరు

నెల్లూరురూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌత్‌మోపూరు గ్రామ పంచాయతీ మొగళ్లపాళెంలో గడిచిన నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. స్థానిక చెరువులో ఏర్పాటు చేసిన మోటార్లు వేసే వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడి దాహార్తితో అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పూర్తిగా పట్టించుకోవడంలేదని, మండల అధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

## నాటుకోళ్ల మృతి నివారణలో అధికారులు విఫలం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పలు రకాల వైరస్‌లతో నాటుకోళ్లు మృతి చెందుతున్నాయని, వ్యాధులను నివారించడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ నేత రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆరోపించారు. నాటు కోళ్ల ఉనికిని కాపాడుకునేందుకు అవసరమైన వైద్యసేవలు అందించాలని కోరుతూ సోమవారం ఆయన పశుసంవర్ధకశాఖ పరిపాలనాధికారి భవానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, అల్లూరు నాగేంద్రసింగ్, కంచర్ల నారాయణయాదవ్, కల్లు భాస్కర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని డైకస్‌రోడ్డు, శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు మారుస్తున్నందున మంగళ, బుధ, గురు వారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైకస్ రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు, శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో కొండదిబ్బ, అలంకార్ సెంటర్, రాజావారి వీధి, శివాలయంగుడి, అరవిందనగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, మైపాడురోడ్డు, వేణుగోపాల్‌నగర్ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు సరఫరాలో జరిగే అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

## అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం విక్రయాలపై నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 అధికారులు సోమవారం నగరంలో దాడులు నిర్వహించారు. పెన్నా వారధి సెంటర్ వద్ద అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బుచ్చిరెడ్డిపాలెం మండలం పంచేడు గ్రామానికి చెందిన కె ఉదయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 11 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జేకేవీ ఎన్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.




ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై ఎమ్మెల్యేలు, నాయకులు, సినీనటులు, అధికారులు

# ప్రకృతి.. సంస్కృతి ప్రభుత్వ ప్రాధాన్యాలు



కృతిశెట్టి నృత్యం



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంయుక్త మీనన్

- ఈ దిశగానే పర్యాటక అభివృద్ధి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

సూళ్లూరుపేట/తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని సంస్కృతిని గుర్తుపెట్టుకోవడమే కాకుండా వాటి ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ఉద్దేశమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించామని తెలిపారు. ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ వలసపక్షుల విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయన్నారు. అందుకే 2001లో అప్పటి తమ టీడీపీ ప్రభుత్వం పక్షుల పండుగను ప్రారంభించిందని గుర్తుచేశారు. వైసీపీ నిలిపేసిన ఈ పండుగను తమ ప్రభుత్వం వచ్చిరాగానే తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. సీఎం సూచనల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించామన్నారు.



హుషారెత్తించిన మంగ్లీ పాట

### క్లుప్తంగా ప్రసంగాలు

ముగింపు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు పోటెత్తి వచ్చారు. సూళ్లూరుపేట కాలేజీ మైదానం నిండిపోయి, ప్రజలు బయటకూడా బారులు తీరారు. సినీరంగానికి చెందిన కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆపి సభను ప్రారంభించారు. ఇటువంటి సందర్భంలో ఎక్కువ సేపు ఉపన్యాసాలు మంచిది కాదనే ఉద్దేశ్యంతో మంత్రి తర్వాత ప్రసంగించిన వారంతా సంక్షిప్త సందేశాలతో ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పండుగ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇక జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఎమ్మెల్యే విజయశ్రీని అనుసరించి ముగించేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం 'ఇప్పుడు మమ్మల్ని పట్టించుకునే పరిస్థితి జనాలకు లేదు' అంటూ ధన్యవాదాలతో ముగించారు. హీరోయిన్లు సంయుక్త మీనన్, కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగ్లీ పాట హుషారెత్తించింది.

### హాజరైన ఐదుగురు ఎమ్మెల్యేలు

ముగింపు సమావేశంలో గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చీరాల ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగుండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎంఎం కొండయ్యలు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్టు సెల్వం, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తానంకి నానాజీ, మాజీ మంత్రి పరసారత్నం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, టూరిజం ఆర్డీ రమణప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి, జిల్లా పర్యాటక అధికారి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### 20 నిమిషాల్లోనే సభ పూర్తి

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు సమావేశం కేవలం 20 నిమిషాలలోనే ముగిసిపోయింది. మంత్రులు, నాయకులు, అధికారులు ముఖ్య అతిథులంతా 7 గంటలకే వేదిక వద్దకువచ్చి వేదిక ముందు ఆశీనులయ్యారు. సుమారు గంటకుపైగా నిమిషాలపాటు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. 8.10 గంటల సమయంలో అందరిని స్టేజీపైకి ఆహ్వానించగా 20 నిమిషాలలోనే అంటే 8.30 గంటలకు సమావేశంలో వక్తలు మాట్లాడటం పూర్తయిపోయింది. దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి 7 గంటలకే వచ్చి వేదిక ముందు ఆశీనులయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన ఆయన 8 గంటల సమయంలో స్టేజీ పైకి రాకుండానే అలాగే వెళ్లిపోయారు.

# జాతరలా.. ఫ్లెమింగో ఉత్సవాలు

- ఘనంగా ముగిసిన పక్షుల పండుగు

### ఉత్సాహంగా క్రీడలు

నిజానికి తొలిరోజు కురిసిన వర్షంతో ఆదివారం సాయంత్రం వరకు క్రీడలు జరగలేదు. నిర్వాహకులు ఆగమేఘాలమీద మట్టి, ఇసుక తోలి చదును చేసి క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే కబడీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడారు. రాత్రి 7 గంటల వరకూ క్రీడా పోటీలు జరిగాయి.



ముగింపు సభకు హాజరైన జనం

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత మూడురోజులపాటు జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా ముగిసింది. తొలి రోజు ఏర్పాట్లలో తడబడినా మిగిలిన రెండు రోజులూ అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో సక్సెస్ చేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో సాయంత్రాలు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారెత్తించాయి. సినీ నటులూ, గాయకులూ రావడంతో జనం పోటెత్తారు. మూడోరోజు సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేలాదిగా పక్షుల పండుగకు తరలివచ్చారు. రంగురంగుల యూనిఫారాల్లో పిల్లలు సందడి చేశారు. నేలపట్టులో పక్షుల వీక్షణకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అటకానితిప్ప వద్ద కూడా ఆటలతో సందడిగా గడిపారు. బీవీపాలెం పడవల రేవు మూడో రోజు కూడా కిక్కిరిసిపోయింది. సూళ్లూరుపేట ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద జనం బారులు తీరారు. ఈ ప్రాంతంలో జరిగే చెంగాళమ్మ జాతరను ఫ్లెమింగో ఫెస్టివల్ తలపించింది. మరో వైపు ఆటల్లోనూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

ఏనుగులను అడవుల్లోకి మళ్లించడానికి

## ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

- డ్రోన్ల ద్వారా కదలికలు గుర్తిస్తాం
- జిల్లా అటవీశాఖ అధికారి వివేక్



తిరుపతి(మంగళం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడిని నివారించడానికి, వాటిని అడవుల్లోకి మళ్లించడానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలిపారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎలిఫెంట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలో పది మంది ఉంటారని, ఇలా మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇవి సబ్ డివిజనల్ ఫారెస్టు అఫీసర్ పర్యవేక్షణలో పని చేస్తాయన్నారు. డ్రోన్ల సాయంతో ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వాటిని గుర్తించి పంచాయతీ, అగ్రికల్చర్ అసిస్టెంట్, విద్యుత్‌శాఖ, అటవీశాఖకు చెందిన అధికారులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లకు సమాచారం అందిస్తారన్నారు. వారు తమ పరిధిలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తారని వివరించారు. ఏనుగుల కట్టడికి గ్రామస్తుల సహకారం అవసరమన్నారు. కాగా, 9 నెలలుగా ఏనుగుల గుంపు చంద్రగిరి మండలం కందులవారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో తిరుగుతోందని, నెల క్రితమే వాటికి పిల్లలు కలిగాయని చెప్పారు. ట్రాకర్ల ద్వారా ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలో మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో ప్రచార జాతాలు, టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు.

## తిరుపతి ఎస్పీగా మళ్లీ హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీగా మళ్లీ హర్షవర్ధన రాజును నియమిస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతేడాది మే 19న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు పనిచేసిన ఈయన జిల్లాలో శాంతి భద్రతలను అదుపు చేయడంలో సఫలీకృతులయ్యారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగించే విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఎన్నికల కమిషన్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. కౌంటింగ్ అనంతరం కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, చంద్రగిరి, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో మళ్లీ రాజకీయ ఘర్షణలు జరగకుండా జాగ్రతలు తీసుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని సంక్షేమం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆయన్ను కడప ఎస్పీగా బదిలీ చేసింది. అక్కడ కొద్ది నెలల పాటు పనిచేసి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన పనితీరును గుర్తించిన ప్రభుత్వం మళ్లీ తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీసులు, మీడియా సహకారంతో పోలీసు శాఖ పరంగా నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తానని చెప్పారు. గతంలో సిద్ధం చేసిన దాదాపు 10 ప్రతిపాదనలను దశల వారీగా అమలు చేస్తానన్నారు. తిరుపతిలో కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని స్మార్ట్ సిటీ నిధుల కింద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తానని హర్షవర్ధనరాజు తెలిపారు.

### 'ఎర్రచందనం' టాస్క్‌ఫోర్సుకు సుబ్బరాయుడు



తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా సుబ్బరాయుడిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతేడాది జూలై 15న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అవినీతి, అక్రమార్కుల గుండెల్లో రైళ్ల పరిగెత్తించారు. ఈయన హయాంలో దాదాపు 10 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయడం, వారికి మెమోలు జారీ చేశారు. శాంతి భద్రతల అదుపునకు, గంజాయిని అరికట్టేందుకు విశేష కృషి చేశారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను భారీ ఎత్తున రికవరీ చేయడంలో రాష్ట్రంలోనే తిరుపతిని నెంబర్ వన్ స్థానంలో నిలిపారు. పోలీసు, ప్రజల మధ్య సమన్వయం కోసం కృషి చేశారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగా.. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. అయితే, ఇటీవల టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి టికెట్లు జారీ చేసే ప్రక్రియలో జరిగిన తొక్కిసలాట, తోపులాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, మరో 40 మంది గాయపడడంతో సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం సీవీఎస్వోతో పాటు అప్పటి ఎస్పీ సుబ్బరాయుడినీ జనవరి 11న బదిలీ చేసింది. 10 రోజులుగా ఎక్కడా పోస్టింగ్ లేకుండా ఉన్న సుబ్బరాయుడిని తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా నియమించింది

### శ్రీవారి అన్నప్రసాదంలో మసాలా వడ



తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదాల మెనూలో టీటీడీ మసాలా వడను చేర్చింది. భక్తులకు కొన్నేళ్లుగా అన్నంతో పాటు కర్రీ, కొబ్బరి చట్నీ, చక్కెర పొంగలి, సాంబారు, రసం, మజ్జిగ వడ్డిస్తున్నారు. అన్నదానం మెనూలో మరో పదార్థం చేర్చాలని గతేడాది నవంబరు 18న టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ప్రయోగాత్మకంగా ఉల్లి,వెల్లుల్లి లేకుండా దాదాపు 5 వేల వడలను తయారు చేసి భక్తులకు వడ్డించారు. దీనిపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో మరో నాలుగు రోజుల పాటు వడల తయారీని పెంచి వడ్డించనున్నారు. రథసప్తమి నాటికి రెండుపూటలా అందించేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. మసాలా వడ మాత్రమే కాకుండా ఆ స్థానంలో మరేదైనా పెట్టవచ్చా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

### రేపటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

**మూడు కేంద్రాల్లో హాజరుకానున్న 1,242మంది అభ్యర్థులు**

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్ష బుధవారం నుంచి నిర్వహించనున్నారు. 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 22, 23, 24, 28, 29 తేదీలలో మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని వివరించారు. 30న రెండవ షిఫ్ట్ 3 నుంచి సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.45, మధ్యాహ్నం 2.45 గంటలలోపు కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్దకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

**పరీక్షా కేంద్రాలివే.. :** అయాన్ డిజిటల్ జూపార్క్, చెర్లోపల్లి, తిరుపతి అయాన్ డిజిటల్ జూపార్క్, కేఎంఎం రామిరెడ్డిపల్లి, చంద్రగిరి ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, విద్యానగర్, కోట మండలం.

## డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఈ కాలేజీలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించిన నేపథ్యంలో తొలిసారిగా స్వయంగా కాలేజీలే పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు 54.2 శాతం, పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు.


ఆలయం ముందు అశ్విన్‌బాబు, బాబీ, తమన్

## స్వామివారు.. పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారు

'డాకు మహారాజ్' దర్శకుడు బాబీ

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): 'డాకు మహారాజ్'తో శ్రీవేంకటేశ్వరస్వామి చాలా పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారని ఆ చిత్ర దర్శకుడు బాబీ సంతోషం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్ బాబుతో కలిసి ఆయన సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం 'వాల్తేరు వీరయ్య' సినిమాతో వచ్చామని, అప్పుడూ స్వామివారు మంచి విజయాన్ని ఇచ్చారన్నారు. తాజాగా 'డాకు మహారాజ్'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్ చెబుతున్నానన్నారు. తొలి నుంచే ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్నామని తమన్ అన్నారు. అందుకే స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చామన్నారు. శ్రీవారి ఆశీస్సులు లేకుండా ఏదీ ప్రారంభించనన్నారు.

## శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**శనివారం నాటి హుండీ ఆదాయం:** రూ.3.68 కోట్లు

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు:** 70,826

**తలనీలాలు సమర్పించినవారు:** 22,625




### పిల్లల కేరింతలు..

### పిట్టల కిలకిలలు..









# కళకళలాడిన నేలపట్టు

### ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్

### మూడు రోజులూ పోటెత్తిన జనం

చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.






## ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..




తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

### పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనం దంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

\- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం



## సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఆటల వేదికలా అటకానితిప్ప


పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

### సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

\- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.





## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలతో జనం ఉర్రూతలూగారు. బుల్లితెర యాంకర్లు రవి, కావ్య, అమూల్య మాటల గారడీలతో ఆకట్టుకోగా.. మిమిక్రీ రాజు తన మిమిక్రీతో జనాలను కట్టిపడేశారు. మల్కి టసింగ్ చేసిన నృత్య ప్రదర్శన అబ్బురపరచింది. సినీ గాయని మంగ్లీ తన ఆటపాటలతో జనాలను హుషారెత్తించారు.



### ప్రకృతిని.. సంస్కృతిని తల్లిలా చూడాలి

ముఖ్య అతిథిగా వచ్చిన సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ 'హాయ్' అంటూ సభికులను పలకరించారు. ప్రకృతి, సంస్కృతిని తల్లిలా చూడాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. వాటర్ బాటిల్ పారవేయడం తేలికని, దాని ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని గుర్తించాలన్నారు. మరో సినీ హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ.. మన సంస్కృతిని ఎన్నో దేశాలు ఆహ్వానిస్తుంటాయని, మనంకూడా సోషల్ మీడియాలో దీనిని బాగా ప్రమోట్ చేసేలా కృషి చేయాలని కోరారు.

## వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించండి

తిరుపతి(వైద్యం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా చిన్నపాటి వ్యాధులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు తప్పక నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ క్యాలెండరును ఆవిష్కరించారు. రోగులకు వైద్యం అందించడంలో రక్త పరీక్షలు ప్రధానమని, వాటిని పక్కాగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వినయ్, హరి, శ్రీకాంత్, ప్రభు పాల్గొన్నారు.

## సామాజిక సేవ చేయాలనుంది

### మిస్ గ్లోబల్ భావనారెడ్డి




తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తానని మిస్ గ్లోబల్ పి.భావనారెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణిస్తున్నానని తెలిపారు. ఫ్యాషన్ రంగంలో రాణించాలన్న తన సంకల్పం ఫలించిందన్నారు. దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష ఉందన్నారు. తాను స్థాపించిన మిత్రా ఫౌండేషన్ సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తామని చెప్పారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రలను కలసి తాను చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి వివరిస్తానన్నారు. సమావేశంలో ఆమె తండ్రి గోపీకృష్ణ, పి.మోహన్‌రెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



డీఎస్పీ గీత

గూడూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రల పరిరక్షణకు చర్యలు తీసు కుంటామని డీఎస్పీ పీ.గీత అన్నారు. సోమ వారం ఆమె గూడూరు డీఎస్పీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో సీఐగా, రెవెన్యూ శాఖలో తహసీల్దారుగా పనిచేసిన ఈమె గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం తొలి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం గూడూరు డీఎస్పీగా నియమించింది. డివిజన్ పరిధిలోని పలువురు పోలీసులు అధికారులు డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలో గంజాయి, సిలికా అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బైక్‌ను ఢీకొన్న ఆటో: యువకుడి మృతి



సన్ని (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటో బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సూళ్లూరుపేట మండల పరిధిలోని చెరువు కండ్రిగ సమీపంలో ఈ ఘటన జరిగింది. మండలంలోని కుదిరి గ్రామానికి చెందిన కె.సన్ని(20) స్నేహితులు హరీష్, బబుల్‌తో కలిసి ఆదివారం సూళ్లూరుపేటలో పక్షుల పండుగకు వెళ్లారు. రాత్రి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో చెరువు కండ్రిగ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సన్ని తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. హరీష్, బబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురినీ సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సన్ని పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం ప్రాంతానికి చెందిన నెమలదిన్నె అన్నపూర్ణ (29) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం కూలి పనికి వెళ్లిన అన్నపూర్ణ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. గ్రామ సమీపంలో ఉన్న బావివైపు వెళ్తుండగా చూశామని పశువుల కాపర్లు చెప్పడంతో అటువైపూ వెతికారు. అప్పటికే చీకటి పడిపోవడంతో ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం అన్నపూర్ణ మృతదేహాన్ని బావిలో తేలియాడు తుండడాన్ని గుర్తించి స్థానికుల సహకారంతో వెలికితీశారు.

## చెరువులో పడి వాటంబేడువాసి మృతి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాటంబేడుకు చెందిన కుప్పంపాటి ప్రసాద్ (40) సూళ్లూరు చెరువులో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం కాలకృత్యాల కోసం చెరువు సమీపంలోకి వెళ్లిన ప్రసాద్ అదుపుతప్పి పడిపోయి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మునస్వామి, వెంకీ యాదవ్ తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్న అన్నపూర్ణ, చెరువులో పడి మృతి చెందిన ప్రసాద్ కుటుంబ సభ్యులను టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, పాముూరు మునస్వామి, వెంకీ యాదవ్, ఏడుకొండలు, ఆలీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



రాజేష్‌ను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ములుమూడి రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. ఏఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ రెన్యూబుల్ ఇంటిగ్రేటెడ్ చాంద్రా ఎలోన్ సిస్టమ్స్ అనే అంశంపై తిరుపతి లోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీదేవి పర్యవేక్షణలో రాజేష్ పరిశోధనలు చేశారు. సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రసంశాపత్రాలు, షీల్డ్‌లతో రాజేష్‌ను అభినందించారు.





## దుప్పట్ల అందజేత

గూడూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం, రూరల్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు దుప్పట్లను సోమ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చలికాలంలో పేదలకు ఉపయోగపడేలా పాస్టర్ల అసోసియేషన్ దుప్పట్లను అందజేయడం అభినందనీయమని, వీటిని పేదలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రత్నశేఖర్, డేవిడ్, ఇస్సాకు, దొరరాజు, యోహాను, విజయకుమార్ పాల్గొన్నారు.



స్టాల్స్ వద్ద బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



పడవలరేవు వద్ద పెద్దకన్నలి ఉన్నత పాఠశాల విద్యార్థుల సందడి





జింకల పార్కు వద్ద విద్యార్థుల సందడి

# పిల్లల ప్రపంచంలా పక్షుల కేంద్రం

### నేలపట్టుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు

దొరవారిసత్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మూడో రోజున నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం అంతా విద్యార్థుల లోకంగా మారింది. జిల్లా కలెక్టర్ చొరవ మేరకు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠ శాలల విద్యార్థులను ఉపాధ్యాయులు నేలపట్టుకు తీసుకు వచ్చారు. గూళ్లలో ఉన్న పక్షులను బైనాక్యులర్స్ ద్వారా చూస్తూ విద్యార్థులు కేరింతలు పెట్టారు. ఓవైపు రకరకాల యూనిఫాంలో విద్యార్థుల చప్పుళ్లు, మరోవైపు పక్షుల కిలకిల రావాలతో నేలపట్టు సందడిగా మారింది. సోమవారం సుమారు 5 వేల మంది విద్యార్థులు నేలపట్టును సందర్శించినట్టు అంచనా. కుటుంబాలుగా వచ్చిన వారు చెట్లకింద భోజనాలతో సంబరంగా గడిపారు.

**చుక్కల జింకలతో...**

ఇక్కడి జింకల పార్కులోని చుక్కల జింకలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పిల్లలకు దగ్గరగా ఉండేలా వాటికి మేత పెట్టడంతో కంచెకు దగ్గరగా అవి వచ్చి కనువిందు చేశాయి.

**బోసిపోయిన వేదిక**

నేలపట్టులో పెలికాన్ అతిథి గృహాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేదిక ఏర్పాటు చేశారు. అయితే కళాకారులు లేకపోవడం, స్థానిక పాఠశాలల విద్యార్థులచే మొక్కుబడి డాన్సులు చేయించడంతో ఈ ప్రాంగణం బోసిపోయింది.

## సమన్వయంతో పక్షుల పండుగ విజయవంతం: విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో విజయవంతంగా నిర్వహించామని సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మూడు రోజుల పాటు ఎటువంటి లోట్లుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆమె అభినం దించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని తక్కువ కాలంలోనే అన్ని పనులు పూర్తి చేసి పక్షుల పండుగను విజయవంతంగా నిర్వహించారన్నారు. వైసీపీ పాలనలో ఆగిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించేందుకు అడిగిన వెంటనే అనుమతులు ఇవ్వడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించడం సంతోషకరని, ఇక పై ఏటా పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకుంటా మన్నారు.

**పర్యాటక రంగానికి పెద్దపీట: సోమిరెడ్డి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో పులికాట్, నేలపట్టు ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు.

**పర్యాటకానికి అనువైన ప్రదేశం: కలెక్టర్**

సూళ్లూరుపేట ప్రాంతం పర్యాటక రంగానికి అనువైన ప్రదేశమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ అందరి సహకారంతో విజయవంతం చేశామని ఆనందం వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు కూడా జరగకుండా మూడు రోజులు పాటు విజయవంతంగా ముగిసిందన్నారు. సూళ్లూరుపేటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అన్ని చర్యలు తీసుకొంటామన్నారు.

## నేలపట్టు అధికారులకు కలెక్టర్ అభినందనలు



వాచ్‌టవర్‌పై నుంచి బైనాక్యులర్ ద్వారా పక్షులను చూస్తున్న కలెక్టర్

దొరవారిసత్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణలో నేలపట్టులో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేసి విజయవంతం చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన నేలపట్టుకు ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించిన గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలసి చెరువు కట్టలపైకి వెళ్లి పక్షులను వీక్షించారు. చివరి వాచ్‌టవర్ వద్దకు చేరుకొని బైనాక్యులర్ ద్వారా తిలకించారు. తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్ఆర్‌వో సౌజన్య, ఎస్ఐ అజయ్‌కుమార్, అటవీశాఖ సిబ్బందిని ఆయన అభినందించారు.

**ఎమ్మెల్యే పరిశీలన**

పక్షుల పండుగ మూడో రోజున అధికారుల ఏర్పాట్ల తీరును ఎమ్మెల్యే విజయశ్రీ మండల నాయకులతో కలిసి పరిశీలించారు. మూడు రోజులూ భారీగా జనం వచ్చారని, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పూర్తిస్థాయిలో అధికారులు విజయవంతం చేశారని ఆమె అభినందించారు.

### వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న

## ప్రభుత్వ భూములను పేదలకు పంచుతాం: టీడీపీ

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీలో ఇద్దరు వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భూమిలేని పేదలకు పంపిణీ చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం వారు గ్రామస్తులతో కలసి ఆక్రమిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేశవరం, రాఘవాపురం, గ్రామాల్లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఇద్దరు వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్నాయన్నారు. కేశవరంలోని సర్వే నెంబరు 309లో 18 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి మామిడి, జామాయిల్ సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములను కూడా లబ్ధిదారులకు తెలియకుండానే వాణిజ్య బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందారని ఆరోపించారు. ఆ భూములను నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పంచి పెడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చావల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కోటేశ్వర ప్రసాద్, అధికార ప్రతినిధి జడ వేణు, నాయకులు భూపతి, చిట్టేటి నాగూరయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు బత్తల బాబు, వెంకటేశ్వర్లు, మాతయ్య పాల్గొన్నారు.



కేశవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

## వరిలో దోమ పోటు



వరిలో దోమ పోటు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

పెళ్లకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో బీపీటీ 5201, కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 తదితర సన్న రకాల వరిని రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్నారు. నాట్లు వేసినప్పటి నుంచి ముసురుతో కూడిన వర్షాలు పడుతుండడంతో పంట తెగుళ్ల బారీన పడింది. అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేయడంతో పంటలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. అయితే వాతావరణ మార్పుల కారణంగా పొగమంచు అధికంగా కురుస్తుండడంతో వరి పైరుకు దోమ పోటు తీవ్రంగా ఉంది. దోమ పోటు నివారణకు వాడే పురుగు మందుల ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. ఈ క్రమంలో ఇంకా నెల రోజుల పాటు పంటలను కాపాడుకోవడానికి ఎంత పెట్టుబడి పెట్టాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు నగదు బహుమతి, ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

చిల్లకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. సోమ వారం తీపనూరు - ఓడూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత జట్టుకు ఎమ్మెల్యే నగదు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గుండాల లీలవతి, శ్రీనివాసులు, చిట్టేటి కీరవాణి, పిచ్చిరాజు, రాఘవలు, లీలాకుమార్ పాల్గొన్నారు.

## పేదలకు రెండు సెంట్ల భూమి ఇవ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లు పేదలకు రెండు సెంట్లు భూమి ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 8వ వార్డు సచివాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

## గ్రామాల్లో అక్షర వెలుగులు



అక్షరదీపిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ ప్రభాకర్, ఏపీఎం అనీల

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాకేంద్రాల ద్వారా గ్రామాల్లో అక్షర వెలుగులు నింపడమే లక్ష్యమని ఏరియా కోఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. కోటలోని వెలుగు కార్యాలయంలో సోమవారం వుల్లాస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. అంతకుముందు వయోజనులకు బోధించే పుస్తకాలను కోఆర్డినేటర్ ప్రభాకర్, ఏపీఎం అనీల ఆధ్వర్యం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో 304 మంది నిరక్షరాసులను గుర్తించామని, వారి కోసం 30 అక్షర కేంద్రాలను ఏర్పాటు చేసి అక్షరాసులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సీసీలు ప్రసాద్, భాస్కర్, శంకర్, శ్రీకాంత్, బిందు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ల ఆవిష్కరణ

కోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోటలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్స్ క్యాలెండర్‌ను తహసీల్దారు జయజయరావు ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందాటి రామశెట్టి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నారాయణరావు, సుబ్బారెడ్డి, ఆర్ఐ మధులత తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు, రిటైర్డ్ టీచర్స్

## గణతంత్ర వేడుకలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



గణతంత్ర్య వేడుకలు ఎంపికైన విద్యార్థులు గాయత్రి, హరికృష్ణ

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికృష్ణ ఈ నెల 26న విజయవాడలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికయ్యారు. వీరు సీఎం చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో జరిగే కవాతులో పాల్గొంటారు. సోమవారం ఆ విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, విభాగాధిపతులు అభినందించారు.

## పరీక్షా కేంద్రం పరిశీలన

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 22నుంచి 30వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. సోమవారం తహసీల్దారు జయజయరావు, కళాశాలలో గదులు, ల్యాబ్‌లు, వసతులను పరిశీలించారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

చంద్రగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. శ్రీవారిమెట్టు మార్గంలో రైలు పట్టాలపై ఆదివారం రాత్రి సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గుండుతో ఉన్నాడని, ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిస్తే 9494228854, 9440416642 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.











పక్షుల పండుగ ముగింపు కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు - తిలకిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బొజ్జల సుధీర్ రెడ్డి, మాలకొండయ్య, కొండేపాటి గంగాప్రసాద్ తదితరులు